క్లుప్తంగా

సైన్స్ టూర్‌కు విద్యార్థులు



సైన్స్ టూర్‌కు బయలుదేరిన విద్యార్థులు

ఆకివీడు: సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన ఎంపీపీ స్కూల్ విద్యార్థులను పలు ప్రాంతాల్లో టూర్‌కు పంపుతున్నట్లు ఎంఈఓ ఎ.రవీంద్ర, ఎంఈఓ–2 సీతారామయ్య చెప్పారు. మండలంలోని ఆరుగురు విద్యార్థులు సోమవారం టూర్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాం జిప్మర్ ఆసుపత్రి, కోరంగి మడ అడవులు, విశాఖపట్టణంలోని సబ్‌మెరైన్, యుద్ధ విమాన, ఆర్కియాలజికల్ మ్యూజియంలను సందర్శిస్తారని చెప్పారు. రెండు రోజుల పర్యటనకు ఒక్కో విద్యార్థికి రూ.2 వేలు వెచ్చిస్తారని తెలిపారు.

రేకుల షెడ్డు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన రేకుల షెడ్డు

ఆకివీడు: గ్యాస్ సిలిండర్ ట్యూబ్ లీకై మంటలు చెలరేగి రేకుల షెడ్డుపై ఉన్న కొబ్బరి ఆకులు సోమవారం మధ్యాహ్నం దగ్ధమయ్యాయి. సంఘటనలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు చెప్పారు. గ్రామంలో నివసిస్తున్న మద్దా మంగ మధ్యాహ్నం టీ కాసుకునేందుకు స్టౌవ్ వెలిగించగా, స్టౌవ్ వద్ద ఉన్న ట్యూబ్ ఊడిపోవడంతో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లో తడికలు, తాటాకులతో నిర్మించిన గోడకు నిప్పంటుకుంది. సంఘటనలో ప్రాణ నష్టం వాటిల్లలేదని నాగేశ్వరరావు వివరించారు.

28 నుంచి అమ్మవార్ల జాతర



అమ్మవార్ల ఆలయం వద్ద చలువ పందిళ్లకు స్తంభం పాతుతున్న జాతర కమిటీ సభ్యులు

కాళ్ల: స్థానికంగా వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీమహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అమ్మవార్లకు పందిరిరాట ముహూర్తం రావడంతో ఆలయం వద్ద చలవ పందిళ్ల వేసేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఈ ఏడాది జాతర వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్

భీమవరం: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్నందున విద్యార్థులు వినియోగించుకోవాలని ఎండీఎం జిల్లా కో–ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు షేక్ బాబాజీ సాహెబ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆనంద సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్

భీమవరం అర్బన్: ప్రతి విద్యార్థిని గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని పడాల చారిట్రబుల్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ ఆకుల మౌనిక అన్నారు. మండలంలోని కొమరాడలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఏబీఎస్ ఆర్ మనోహర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా మాసూళ్లు



యనమదుర్రులో ఆరబెట్టిన ధాన్యం



గునుపూడి వద్ద ట్రాక్టర్‌పై ధాన్యం లోడు చేస్తున్న కూలీలు



దేగాపురం వద్ద యంత్రాలతో మాసూళ్లు చేస్తున్న రైతులు

- వాతావరణ మార్పులతో చురుగ్గా ధాన్యం ఒబ్బిడి
- వరికోత యంత్రాలతో కోస్తున్న రైతులు
- ఇప్పటి వరకు మండలంలో 2500 ఎకరాల్లో ధాన్యం ఒబ్బిడి

భీమవరం అర్బన్: మండలంలో దాళ్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం చేతికొచ్చే సమయంలో వరుణుడి రూపంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. దీంతో రైతులు పొలాల్లో వరికోత యంత్రాలతో ధాన్యం మాసూళ్లు ముమ్మరంగా చేస్తున్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, తుందుర్రు, పెదగరువు, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, తదితర గ్రామాల్లో సుమారు 8 వేల 300 ఎకరాల్లో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పంట పక్వానికి రావడంతో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 2 వేల 500 ఎకరాల్లో ధాన్యం ఒబ్బిడి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 12 వరకు ఎండలు ఎక్కువగా ఉండి వాతావరణం అనుకూలించడంతో వరి చేలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో భారీ ఆశలతో మాసూళ్లు సాగించినప్పటికీ ఏప్రిల్ 13న సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. అకాల వర్షం పడటంతో వరి చేలల్లో వర్షపు నీరు ఉండిపోయి ఆరకపోవడంతో వరికోత యంత్రాలు దిగబడిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో మాసూళ్ల కొంత ఆలస్యమవుతున్నాయంటున్నారు. కొన్నిచోట్ల చేలల్లో ఆరుదలైన వరి వర్షం కారణంగా మళ్లీ పసిరిగా మారాయని, అక్కడక్కడ గింజ రాలిపోయి, దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మబ్బులతో రైతులు కలవరం

గత వారం రోజుల క్రితం అకాల వర్షం పడి బలమైన ఈదురు గాలులు వీయడంతో కొన్నిచోట్ల వరి చేలు నేలనంటాయి. అప్పటి నుంచి రైతులు ఆకాశంలో మబ్బులు పడితే భయాందోళనకు గురవుతున్నారు. వరికోత యంత్రాలతో మాసూళ్ల సాగించి, తేమ శాతం 17 వచ్చే వరకు ధాన్యాన్ని ఎండబెట్టి వెంటనే వారికి అనుకూలమైన మిల్లులకు తరలిస్తున్నారు.

ధాన్యంలో తేమ శాతం 17 ఉండాలి



రైతులు మాసూళ్ల చేసిన ధాన్యాన్ని తేమ శాతం 17 వచ్చే వరకు ఆరబెట్టాలి. వెంటనే రైతుసేవా కేంద్రాల్లో గోనే సంచులు తీసుకుని వారికి అనుకూలమైన మిల్లులకు తరలించుకోవాలి. రైతులు ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని కల్లాల్లో అశ్రద్ధ చేయకుండా మిల్లులకుగాని, సురక్షిత ప్రాంతాలకు గాని తరలిస్తే బాగుంటుంది. దీంతో రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

–నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

నేడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పర్యటన

భీమవరం: ఉండి నియోజకవర్గంలో అక్రమంగా పేదల ఇళ్లను తొలగిస్తున్న ప్రాంతాలను పరిశీలించి బాధితులను పరామర్శించేందుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం పర్యటించనున్నారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నియోజకవర్గంలోని ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో దుర్మార్గంగా ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు కూల్చి వేస్తున్నారని, దీంతో బాధితులు చిన్న పిల్లలు, వృద్ధులతో రోడ్డున పడ్డారని గోపాలన్ ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సీపీఎం నేత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు బాధితులను పరామర్శించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గోపాలన్ తెలిపారు.

దళితులపై వివక్ష తగదు



జి.సుందర్‌కుమార్



క్రాంతిబాబు

ఉండి: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలోని మల్లాంలో దళితులపై కుల వివక్ష దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.సుందర్‌కుమార్ పత్రికా ప్రకటనలో సోమవారం మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా సూక్తులు చెప్పే ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పని చేస్తూ విద్యుత్ షాక్‌తో మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి నష్ట పరిహారం అడగడం దళితులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా లేక ఉప ముఖ్యమంత్రి రాజ్యమా అని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలపడం తమకు అవమానంగా భావించిన ఆ గ్రామ పెద్దలు దళితులపై కోపగించి పొలంలో పనులకు పిలవకపోవడంతో పాటు టీ, టిఫిన్, పాలు అమ్మకం చేయకపోవడం అత్యంత దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి మృతుడి కుటుంబానికి రూ.15 లక్షలు నష్ట పరిహారం ఇవ్వడంతో పాటుగా దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారందరిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు సుందర్‌కుమార్ తెలిపారు.

సాంఘిక బహిష్కరణ దారుణం

భీమవరం: పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులపై కుల వివక్ష, సాంఘిక బహిష్కరణ జరగడం దారుణమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ధ్వజమెత్తారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళితులపై గ్రామ బహిష్కరణ చేస్తే శాంతి కమిటీ వేసి పరిష్కరించామని ఆర్డీవో ప్రకటించడం అన్యాయమని, కుల వివక్ష చూపిన పెద్దలను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మల్లం గ్రామంలో ఆధిపత్య కులానికి చెందిన వారు అర్ధ రాత్రి నిద్రిస్తున్న దళితపేటపై మూకుమ్మడి దాడి చేయగా 23 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నడుస్తుందని గుర్తు చేశారు. ఘటనను పక్కదారి పట్టించి రాజీ కుదిర్చిన ఆర్డీవో, అధికారులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని క్రాంతిబాబు డిమాండ్ చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి తక్షణం స్పందించాలని లేకుంటే కేవీపీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి శిక్షణా తరగతులు



వేసవి శిక్షణా తరగతుల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఈ నెల 29వ తేదీ నుంచి మే 30 వరకు శ్రీసంతోషి మాత కోచింగ్ సెంటర్ ఆధర్యంలో పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో బాలలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. సోమవారం నరసయ్య అగ్రహారంలో శిక్షణ తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నాచు శ్రీవల్లి మాట్లాడుతూ బాలలకు శిక్షణతోపాటు నెల రోజుల పాటు మహిళలకు కుట్టు మిషన్, మిషన్ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, సంగీతం, వేదిక్, అబాకస్, కరాటే వంటి అంశాలపై నాచువారి సెంటర్, బ్యాంక్ కాలనీ, నరసయ్య అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 96769 72227కు సంప్రదించాలని శ్రీవల్లి చెప్పారు. కార్యక్రమంలో అడబాల స్వర్ణ, నూలి హారిక, సుంకర సుబ్బలక్ష్మి, వేముల ఫణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారని, ప్రభుత్వ రాయితీలు పొందుతున్నారని, పట్టణంలో ఎన్ని గ్రూపులున్నాయి వాటి వివరాలు తెలపాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారని చెప్పారు. నాన్ లేఅవుట్లలో నిర్మిస్తున్నారని, ఇతర సమస్యలపై పలు సార్లు ఫిర్యాదు చేసినా, ఎండార్స్‌మెంట్ ఇస్తున్నారే గాని సమస్య పరిష్కారం కావడం లేదని, నగర పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన మరో ఫిర్యాదు చేశారన్నారు. చినకాపవరం డ్రెయిన్‌కు చేర్చి స్థానిక చేపల రేవు వద్ద అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని, డ్రెయిన్‌లో వ్యర్థాలు పారవేయడం వల్ల నీటి పారుదలకు ఇబ్బందిగా ఉందని మరో ఫిర్యాదు చేశారని చెప్పారు. సాలిపేటలో ఆక్రమణల గురించి, మద్యం, గంజాయి సేవించి కొంత మంది యువకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన శలాకోట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారని తెలిపారు. స్థానిక ముస్లిం వీధిలో డ్రెయినేజీ సౌకర్యం లేదని ఎండీ ఆలీ ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. స్థానిక కృష్ణదేవరాయ నగర్‌లో కుళాయి నీరు రావడం లేదని, దుంపగడపలో ఆక్రమణలపై పలువురు ఫిర్యాదు చేశారని ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా రాములోరి విగ్రహాల ఊరేగింపు

ఆకివీడు: స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద వేంచేసియున్న కోదండ రామాలయం పునఃనిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా సోమవారం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద ఉంచిన విగ్రహాలను ఊరేగింపుగా పురవీధులు, జాతీయ రహదారి గుండా వనువులమ్మ ఆలయం వరకూ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామనామ స్మరణతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో హోలమాలు, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

కాళ్ల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న చేపట్టిన చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సూరిబాబు కోరారు. సోమవారం కాళ్లలో చలో కలెక్టరేట్ కరపత్రాలను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్ రద్దు చేయాలని, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, ముడి సరుకులపై జీఎస్టీ తగ్గించాలని, సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండలాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో అనధికారికంగా బెల్టుషాపు నిర్వహిస్తున్న మానికి చెందిన బొక్కా రాజును ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని భీమవరం ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై పి.సునీల్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో సీఐ బలరామరాజు, ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

లాడ్జిపై పోలీసుల దాడులు

భీమవరం: పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో 9 జంటలను అదుపులోకి తీసుకున్నారు. అయితే వీరిలో కొంత మంది కళాశాల విద్యార్థినులు ఉన్నట్లు సమాచారం. వివరాలు సేకరిస్తున్నట్లు సీఐ కాళీచరణ్ చెప్పారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

భీమవరం: సవిలో ప్రజలు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించి, మాట్లాడారు. సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ తమ సంస్థ సభ్యుల సహకారంతో చలివేంద్రంలో మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, సీఐలు ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, మానవత సంస్థ కో–చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తి, కోశాధికారి గ్రంధి కుమారవెంకటేశ్వర ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు, అల్లు శ్రీనివాస్, సత్యనారాయణరాజు, ఇందుకూరి శివాజీవర్మ తదితరులు పాల్గొన్నారు.

భూమిని రక్షించేందుకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు

కాళ్ల: పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించి, భూమిని కాపాడేందుకు చెట్లు నాటాలని ఉన్నత భారత్ అభియాన్ కాళ్లకూరు కో–ఆర్డినేటర్ జి.సూరిబాబు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో కాళ్లకూరు యూపీ స్కూల్ ఆవరణలో సోమవారం విద్యార్థులకు జాతీయ ధరిత్రి దినోత్సవం ప్రాధాన్యతపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీగా ఉన్న ప్రతిచోటా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించే ధరిత్రి దినోత్సవం కార్యక్రమంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ, ఇంజనీరింగ్ కాలేజి ప్రొఫెసర్లు జి.మెహర్ గణేష్, టి.భాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలు ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలోని ప్రభుత్వ కాలనీలో కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కాలనీ వాసులు ఎంపీడీఓ స్వాతికి సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కాలనీలో ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు ఒత్తిడి చేశారని, తీరా నిర్మించుకున్నాక రోడ్డు, కరెంట్, కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే పైపులైన్ ఏర్పాటు చేసి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే మంచినీళ్ల బిందెలతో ప్రభుత్వ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో మట్టా నలిని మోహన్, కనకదుర్గ భవాని దంపతులచే ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామి వార్లను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు వెంకటరాజు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. 22న స్వామి వారి కల్యాణోత్సవం, 23న గరుడోత్సవం, 24న వైభవోత్సవం, 25న రథోత్సవం, 26న ఊంజలసేవ 28న అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పెన్నాడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణికుమార్, ఏడిద త్రిమూర్తులు, పద్మావతి మహిళా పారాయణం బృందం పాల్గొన్నారు.

గోస్తనీ కాలువ రోడ్డు అధ్వానం



జుత్తిగ వద్ద రాళ్లు లేచిన గోస్తనీ పంట కాలువ గట్టు రోడ్డు



రోడ్డుపై గుంతలు పడడంతో నిలిచిపోయిన నీరు

మల్లిపూడి – జుత్తిగ రహదారిపై రాకపోకలకు అవస్థలు

పెనుమంట్ర: అత్తిలి – ఇరగవరం ఆర్అండ్‌బీ రోడ్డుకు అనుసంధానమైన మల్లిపూడి – జుత్తిగ కెనాల్ రోడ్డు అధ్వానంగా మారింది. రాళ్లు పైకి లేచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు. గతంలో జెడ్పీ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును ఆర్అండ్‌బీ శాఖకు అనుసంధానం చేశారు. ఒకవైపు గోస్తనీ పంట కాలువ, మరో వైపు గోస్తనీ డ్రెయిన్ ఉన్న ఈ రోడ్డులో రెండు రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులకు ధాన్యం తీసుకొచ్చేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డెల్టా ఆధునికీకరణలో మల్లిపూడి ఫుట్‌పాత్ వంతెన నుంచి జుత్తిగ పెద్ద వంతెన వరకు కొంత మేర గోస్తనీ కెనాల్‌లో రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. తదుపరి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ అధికారులు ఈ రోడ్డును పూర్తిగా విస్మరించారు. దీంతో నేడు ఈ రోడ్డంతా రాళ్లు లేచిపోయి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ ఈ ప్రాంతం నుంచి తణుకు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే చిన్న వ్యానులతో పాటు పెద్ద బస్సులు కూడా కెనాల్ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటాయి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుపై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలి



మల్లిపూడి నుంచి జుత్తిగ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు పొడవునా నివాస గృహాలు ఉన్నాయి. సిమెంట్ రోడ్డుగా నిర్మించాలి. 1వ వార్డు పరిధిలో ఉన్న ఈ రోడ్డును సీసీ రోడ్డు, డ్రెయిన్‌లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. గోస్తనీ పంట కాలువలో కొంతమేర రిటైనింగ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది.

– వెలగల సత్యనారాయణరెడ్డి, వార్డు మెంబర్, జుత్తిగ

రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు



మల్లిపూడి ఫుట్‌పాత్ బ్రిడ్జి నుంచి జుత్తిగలోని నత్తారామేశ్వరం – సిద్ధాంతం రోడ్డు వరకు 750 మీటర్లు పొడవు గల ఈ రోడ్డును సిమెంట్ రోడ్డుగా, గోస్తనీ కెనాల్‌లో మిగిలిన భాగాన్ని రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. త్వరలో ఈరోడ్డు నిర్మాణానికి అనుమతులు రానున్నాయి.

– యశ్వంత్, ఏఈ, ఆర్అండ్‌బీ పెనుమంట్ర